క్లుప్తంగా

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న పాఠశాల సిబ్బంది

వంగర: మండల పరిధిలోని మడ్డువలస దగ్గరున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు కోసం 92 మంది విద్యార్థినులు దరఖాస్తు చేసుకోగా, 78 మంది పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ పి.పద్మావతి తెలిపారు.

1న రక్తదాన శిబిరం

బొబ్బిలి: స్థానిక ఎస్ఆర్ఐ ఆస్పత్రి ఆవరణలో జూలై 1వ తేదీన రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. దాతలు తరలివచ్చి, రక్తం దానం చేసి ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే రక్తదానం చేసిన వారు 3 నెలలు గడిచిన తర్వాతనే రక్తదానం చేయాలన్నారు.

బోధనలో నూతన పద్ధతులు అవలంబించాలి



రాజీపేట పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

రాజాం: విద్యాబోధనలో నూతన పద్ధతులు అవలంబించాలని ఎంఈవో–2 యాగాటి దుర్గారావు సూచించారు. మండలంలోని రాజీపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన.. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతంపై ఆరాతీశారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా, ఆసక్తి కలిగించేలా బోధన చేయాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలుచేయాలని, మెనూ ప్రకారం వంటకాలు చేయాలని సూచించారు.


విత్తనశుద్ధిపై అవగాహన



విత్తనాలు శుద్ధి చేస్తున్న రైతులు

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాథపురంలో విత్తనశుద్ధిపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఉరిటి శంకరరావు సూడోమోనాస్ పౌడర్, బీజామృతం ద్వారా విత్తనాలు శుద్ధి చేయడం తెలిపారు. వరి విత్తనాలను ఇలా శుద్ధి చేసుకుని, విత్తుకోవడం ద్వారా అగ్గి, పాముపొడ, వేరుకుళ్లు తెగుళ్ల బారిన పంట పడకుండా ఉంటుందన్నారు. నారు విత్తుకునేముందు సూడోమోనాస్ ద్రావణంలో నారుకట్టలు ముంచి, విత్తుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సుశ్మిత, ఐసీఆర్‌పీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


దోమల నివారణ మందు పిచికారీ



దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తున్న దృశ్యం

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ శనివారం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి చింతల సత్యనారాయణ పర్యవేక్షణలో గ్రామంలోని అన్ని వీధుల్లోని కాలువల్లో దోమలు పెరగకుండా మందును స్ప్రే చేయించారు. గ్రామస్తులు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి లవకుమార్, సచివాలయ పంచాయతీ కార్యదర్శి వి.హరి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గెస్ట్ టీచర్స్

బొబ్బిలి: తమను కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా పరిగణించాలని మహాత్మాజ్యోతీరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులాల గెస్ట్ ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఇదే విషయమై ఎమ్మెల్యే బేబి నాయనకు వారు శనివారం వినతిపత్రం అందజేశారు. తమ విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టి.సంజీవి, ఎ.పైడిరాజు, బి.సన్యాసినాయుడు తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బేబి నాయన



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబి నాయన

బొబ్బిలి రూరల్: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు (బేబి నాయన) అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేకు ఎంపీపీ శంబంగి లక్ష్మి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడులు సాదరంగా ఆహ్వానించి, సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని, కాసేపు మాట్లాడారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పర్యటిస్తానని, తన దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను పరిష్కరిస్తానన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున పారిశుధ్యం, స్వచ్ఛమైన తాగునీరు సరఫరా, దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను సకాలంలో అందజేయాలని కోరారు. ప్రైవేటు వ్యాపారుల వద్ద ఉన్న విత్తనాలు, పురుగు మందు, ఎరువుల నాణ్యతలో అనుమానాలు ఉన్నాయని కృష్ణాపురం, దిబ్బగుడ్డివలస ఎంపీటీసీలు గంట సింహాచలం, వెన్నెల నాగరాజులు ఏవో శ్యామ్‌సుందర్‌కు తెలిపారు. ఆర్అండ్‌బీ జేఈ నూకరాజు మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్ల మరమ్మతులకు సంబంధించి, నిధులు కావాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. పారాది కొత్తబ్రిడ్జి నిర్మాణం పనులు మరో రెండు నెలల్లో ప్రారంభమవుతాయన్నారు. తమ గ్రామం వద్ద రైల్వే మూడోలైన్ వేయడం వల్ల పట్టాలకు అటు ఇటు పెన్సింగ్ వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రైల్వే అధికారులతో మాట్లాడి పెన్సింగ్ పనులు నిలిపివేయాలన్న విషయం గున్నతోటవలస ఎంపీటీసీ ఈశ్వరరావు జేఈ దృష్టికి తీసుకురాగా, ఆ సమస్యను పరిష్కరిస్తామని జేఈ అన్నారు. పక్కి పీహెచ్‌సీ వైద్యాధికారిణి లక్ష్మి మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్ వేసుకున్న వారికి జ్వరం, పుండు అవ్వడం సాధారణమని, భయపడాల్సిన పనిలేదన్నారు. సమావేశంలో ఇతర సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానమిచ్చారు. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీడీవో పి.రవికుమార్, తహసీల్దార్ త్రినాధరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: అభివృద్ధి పనుల టెండర్లు రద్దు చేయాలని మున్సిపల్ చైర్మన్‌కు డీసెంట్ నోట్ అందజేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే..

బొబ్బిలి: మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అధ్యక్షతన శనివారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే బేబి నాయన హాజరై, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన అక్కడి నుంచి మరోచోట జరిగిన సమావేశానికి వెళ్లిపోగా, అభివృద్ధి పనుల టెండర్లు రద్దు చేయాలని టీడీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేస్తూ డీసెంట్ నోట్ అందజేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ చోడిగంజి రమేష్‌నాయుడు తదితరులు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని, ఈ సమయంలో ప్రస్తుతం కాంట్రాక్టర్‌కు ఇచ్చిన పనులు రద్దు చేయడం సరికాదన్నారు. అంతకుముందు మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ ఎమ్మెల్యే బేబీ నాయనను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నో అభివృద్ధి పనులు చేసి, మంచిపేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు అజెండాపై ప్రశ్నించారు. అనంతరం కౌన్సిల్ అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

- సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్‌ఆనంద్ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్‌ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: రాజీయే రాజమార్గమని, కేసుల పరిష్కారానికి కక్షిదారులు రాజీమార్గాన్ని అనుసరించాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్ వివేక్‌ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో న్యాయవిజ్ఞాన సదస్సుతో పాటు జాతీయ లోక్‌అదాలత్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ తీర్పు.. అంతిమ తీర్పు అని వెల్లడించారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయంతో పాటు సకాలంలో కేసుల పరిష్కారం కూడా లభిస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసుల పరిష్కారంతో పాటు చట్టరీత్యా రాజీకి అనుకూలమైన క్రిమినల్ కేసులను కూడా ఇరుపార్టీల అంగీకారం మేర పరిష్కరించడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు వాపసు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో రాజాం జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, రాజాం బార్ అసోషియేషన్ ప్రెసిడెంట్ కె.రామినాయుడు, ప్రభుత్వ న్యాయవాది శెట్టి పోలారావు, ఏపీపీ కిమిడి సూర్యకుమార్, సీనియర్ న్యాయవాది రెడ్డి రామ్మూర్తి, లోక్ అదాలత్ న్యాయవాద సభ్యులు బి.అప్పలనాయుడు, జె.అప్పలనాయుడు, రాజాం, రేగిడి, సంతకవిటి, పోలీసులు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 129 కేసులు పరిష్కారం..

రాజాం కోర్టు సముదాయంలో రాజాం సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్‌ఆనంద్ శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 129 కేసులు పరిష్కరించారు. ఇందులో సివిల్ కేసులు 11 ఉండగా, క్రిమినల్ కేసులు 91, సారాయి కేసులు 03, భార్యభర్తల తగాదాలు 13, చెక్‌బౌన్స్ కేసులు 11 ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే రాజాం మండలంలోని పొగిరి, రేగిడి మండలంలోని పుర్లి గ్రామానికి చెందిన రెండు జంటలను లోక్‌అదాలత్‌లో కౌన్సిలింగ్ ద్వారా ఒక్కటి చేశామన్నారు.

బొబ్బిలి: స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 169 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ శనివారం తెలిపారు. సివిల్, చెక్‌బౌన్స్, ఎక్సైజ్ తదితర విభాగాల్లో కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

తెర్లాం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బందితో శనివారం సమావేశమైన ఆయన.. వర్షాకాలంలో ప్రజలు ఎక్కువగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాల బారినపడే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలని, వీధి కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు గ్రామాల్లోని ప్రతీ ఇంటికీ వెళ్లి, డయేరియా, జ్వరాలతో ఎవరైనా బాధపడుతున్నారా లేదా అని పరిశీలించాలన్నారు. ప్రతీ ఇంటికీ రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని, సర్పంచ్‌ల సహకారంతో రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టడం చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ దివ్యభారతి, సీహెచ్‌వో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

తెర్లాం: మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంపీడీవో బి.మధుసూదనరావు శనివారం తెలిపారు. పెన్షన్ల పంపిణీకి అవసరమైన సొమ్మును స్థానిక స్టేట్ బ్యాంక్ నుంచి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు విత్‌డ్రా చేశారని చెప్పారు. జూలై 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచే సచివాలయ ఉద్యోగులు వారికి కేటాయించిన పెన్షనర్ల ఇంటికి వెళ్లి, పెన్షన్ డబ్బులు అందజేస్తారన్నారు. పింఛన్ల పంపిణీ రెండురోజుల్లో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. పెన్షన్ల పంపిణీలో ఎటువంటి జాప్యం జరగకుండా పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలన్నారు.

రామభద్రపురం: సామాజిక పింఛన్ల పంపిణీ పారదర్శకంగా చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణతో కలిసి ఆమె విలేకరులతో శనివారం మాట్లాడారు. మండలంలో 7,852 మంది పింఛన్‌దారులు ఉన్నారని, వీరందరికీ జూలై 1వ తేదీన రూ.5.11 కోట్లు అందజేయడం జరుగుతుందన్నారు.

వంగర: లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు తెచ్చి, అందివ్వడం జరుగుతుందని ఎంపీడీవో సాల్మన్ రాజ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల ఉద్యోగులతో శనివారం సమావేశమైన ఆయన.. మండలంలోని 19 సచివాలయాల పరిధిలోని 29 గ్రామ పంచాయతీల్లో మొత్తం 6,553 మంది పింఛన్‌దారులు ఉన్నారని, వారందరికీ సచివాలయ ఉద్యోగులే వారి వద్దకు పెన్షన్ తెచ్చి, ఇస్తారన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో లోపింటి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదనరావు

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో బి.మధుసూదనరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవోలు త్రినాధరావు, పాపారావుల ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశమైన ఆయన.. ఒక్కో పాఠశాలలో ఈ ఏడాది ఎంత మంది విద్యార్థులు చేరారు.. ఇంకా బడిఈడు పిల్లలు బడిలో చేరకుండా ఎవరైనా ఉన్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారా, లేదా అని అడిగారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, పీఎం పోషణ గోరుముద్ద పథకం సక్రమంగా అమలు చేయాలని తెలిపారు. పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం 90 రోజుల పాటు సంసిద్ధత కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. నాణ్యమైన విద్యాబోధన అందించాలని సూచించారు.

ఆరోగ్య తనిఖీలు



వన్నలిలో ప్రజలకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో 104 వాహనం సేవల ద్వారా ప్రజలకు ఆరోగ్య తనిఖీలు శనివారం నిర్వహించారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సోహినీరాఘవ్ మాట్లాడుతూ గ్రామాలకు కేటాయించిన వారాల్లో 104 వాహనం ద్వారా గ్రామానికి వచ్చి, వైద్య సేవలు అందించడం జరుగుతోందని, 14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలతో పాటు 64 రకాల మందులు అందిస్తున్నామన్నారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ ప్రియా, ఏఎన్ఎం రాజేశ్వరి, సర్పంచ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

రేగిడి: నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో జి.మురళీకృష్ణ హెచ్చరించారు. మండలంలోని బూరాడ, పనసలవలస గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఆయన.. షాపుల్లోని విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల కాలపరిమితి వివరాలు పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకే విక్రయాలు చేపట్టాలని, రైతులను మోసగించాలని ప్రయత్నిస్తే సహించేది లేదన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి



తహసీల్దార్ సులోచనరాణికి వినతిపత్రం అందిస్తున్న గిరిజన రైతులు

రామభద్రపురం: తమ భూ సమస్యను పరిష్కరించి, న్యాయం చేయాలని కొండకెంగువకు చెందిన గిరిజన రైతు బంటుపల్లి పార్వతి కోరుతున్నారు. ఇదే విషయమై తహసీల్దార్ సులోచనరాణికి శనివారం వినతిపత్రం అందించారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 65/2లోని 3.90 ఎకరాల భూమిని 60 ఏళ్ల నుంచి తాము సాగుచేస్తున్నాని, అయితే అదే భూమిని 2017లో అదే గ్రామానికి చెందిన పాయిరి పైడితల్లి, పాయిరి సన్యాసమ్మల వద్ద అదే గ్రామానికి చెందిన పెత్తందారులు కంచుపల్లి కోటీశ్వరరావు, బెవర పోలినాయుడులు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుని 17 ఏళ్లు అవుతున్నా ఇప్పటివరకు ఆ భూమి వారిదని, వారు కొనుగోలు చేసుకున్నామని ఇంతవరకు వారు రాలేదన్నారు. ఇప్పుడు ఆ భూమి వారిదని గిరిజన రైతుల వద్ద నుంచి లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన రీ సర్వేలో కూడా వారు కనీసం ఆ భూమి వద్దకు రాలేదన్నారు. రీ సర్వేలో కూడా తన పేరిట(గిరిజన రైతు బంటుపల్లి పార్వతి) ఆ భూమి నమోదై ఉందని, ఆన్‌లైన్‌లో 1బి కూడా వస్తోందన్నారు. తనకు న్యాయం చేయాలన్నారు. తహసీల్దార్ సులోచరాణి మాట్లాడుతూ క్షేత్రస్థాయికి వెళ్లి, పరిశీలనానంతరం, ఇరువర్గాలతో సమావేశమై న్యాయం చేస్తామన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలి



అంతకాపల్లిలో ఉపాధ్యాయులతో సమావేశమైన ఎంఈవో–1 ప్రవీణ్‌కుమార్

రాజాం సిటీ: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలని ఎంఈవో–1 పి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని అంతకాపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం సందర్శించి, తరగతుల వారీగా వివిధ ప్రశ్నలు అడిగి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై, పలు సూచనలు చేశారు. ప్రతీ విద్యార్థి గ్రేడ్–ఏలో ఉండేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. అక్కడి నుంచి సారధి ప్రాథమిక పాఠశాలకు వెళ్లి, అక్కడ జరుగుతున్న నాడు–నేడు అభివృద్ధి పనులను చూసి, పనులు త్వరితగతిన పూర్తిచే చేయాలని కోరారు.

గృహ ఆధారిత విద్యను పటిష్టం చేయాలి



గృహాధారిత విద్య పొందుతున్న దివ్యాంగ చిన్నారి పరిస్థితిని పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: ప్రత్యేకావసరాలు గల పిల్లల కోసం అందిస్తున్న గృహ ఆధారిత విద్య(సహిత విద్య)ను మరింత పటిష్టంగా అమలుచేయాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని నందబలగ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న గంట నాగమణి అనే ప్రత్యేకావసరాలు గల దివ్యాంగ విద్యార్థిని పరిస్థితిని ఆయన శనివారం పరిశీలించారు. ఆ విద్యార్థికి అందిస్తున్న సహిత విద్యను, శారీరక, మానసిక ఎదుగుదలకు తీసుకుంటున్న చర్యలపై ఆరాతీశారు. గృహాధారిత విద్యార్థులకు మంచి విద్యాబోధనతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సహిత విద్యను పొందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థికపరమైన అలవెన్స్‌లు అందజేస్తున్నామన్నారు. ప్రతీ శనివారం మండలంలోని ఏదో ఒక గ్రామానికి వెళ్లి, గృహాధారిత విద్య పొందుతున్న ప్రత్యేకావసరాలు గల పిల్లలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట మండల ఐఈఆర్‌టీ సూర్యారావు తదితరులు ఉన్నారు.

మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచండి



కుసుమూరు ప్రాథమికోన్నత పాఠశాల మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈవో త్రినాధరావు సూచించారు. మండలంలోని కుసుమూరు ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన.. అక్కడి మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులు ప్రతిరోజూ వినియోగించేలా మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, వాటిని సక్రమంగా ఉంచకపోతే సంబంధిత స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనం వంటలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు.

వంటకాలు రుచికరంగా ఉండాలి



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలు రుచికరంగా ఉండాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని దేవుదళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన..అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వంటకాలు చేసి, విద్యార్థులకు వడ్డించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో జీవామృతం తయారీపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఐసీఆర్‌పీ పైలతవిటినాయుడు తొలుత జీవామృతం తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించి, దాని ప్రయోజనాలు వివరించారు. ఒక ఎకరానికి సంబంధించి, జీవామృతం తయారు చేయాలంటే 5 కిలోల ఆవుపేడ, 5 లీటర్ల పశుమూత్రం, 200 గ్రాముల ఇంగువ ద్రావణం ఐదు లీటర్ల నీటిలో కలిపి ఒక తొట్టిలో నాలుగు రోజుల పాటు నిల్వచేయాన్నారు. ఉదయం, సాయంత్రం కర్రతో దానిని సవ్యదిశలో కలపాలన్నారు. ఈ మిశ్రమానికి 150 గ్రాముల సున్నం కలిపి 200 గ్రాముల ఇంగువ రెండు లీటర్ల నీటిలో బాగా మరగబెట్టి, దానిలో ఓ ముద్ద ఇంగువ వేసి చక్కగా కలిపి చల్లారిన తరువాత ఇంగువ ద్రావణాన్ని పేడమూత్రం ద్రావణంతో కలపాలన్నారు. ఈ ద్రావణాన్ని గుడ్డలో వడకట్టి, ఈ ద్రావణానికి 200 లీటర్ల నీటిని కలిపి ఒక ఎకరా పొలానికి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు జి.రవి, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏవో శ్యామ్‌సుందర్

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఏవో శ్యామ్‌సుందర్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన పలు సూచనలు చేశారు. నిషేధిత బీటీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువుల నిల్వలు తెలిపే బోర్డు దుకాణం బయట ఏర్పాటు చేయాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రశీదు అందివ్వాలన్నారు.

పక్కాగా రికార్డులు నిర్వహించాలి

వంగర: ఎరువులు దుకాణాల్లో రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఏవో తట్టికోట కన్నబాబు సూచించారు. మండల కేంద్రంతో పాటు అరసాడ గ్రామం దగ్గరున్న ఎరువుల దుకాణాల్లో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఆయన.. రికార్డుల నిర్వహణ, ధరల పట్టిక, ఎరువులు, పురుగుమందుల నిల్వలు, వాటి విక్రయాలను పరిశీలించారు. నాణ్యత కలిగిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రసీదులు అందివ్వాలన్నారు.